## అడ్వాన్స్‌డ్ పీజీ డిప్లొమా ఇన్ హెల్త్ కేర్ కోర్సుల ఫీజు స్వీకరణ

ఉస్మానియా యూనివర్సిటీ, నవంబర్ 15: ఓయూ పరిధిలోని వివిధ అడ్వాన్స్‌డ్ పీజీ డిప్లొమా ఇన్ హెల్త్ కేర్ కోర్సుల పరీక్ష ఫీజును స్వీకరించనున్నట్టు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ రాములు ఒక ప్రకటనలో తెలిపారు. అన్ని సెమిస్టర్ల బ్యాక్‌లాగ్ పరీక్ష ఫీజును ఈనెల 21లోగా సంబంధిత కళాశాలల్లో చెల్లించాలని చెప్పారు. రూ.500 అపరాధ రుసుముతో 26వ తేదీ వరకు చెల్లించవచ్చన్నారు. బ్యాక్‌లాగ్ అభ్యర్థులకు ఇది చివరి అవకాశమని పేర్కొన్నారు. పరీక్షలను వచ్చే నెలలోనే నిర్వహించనున్నట్టు తెలిపారు. పరీక్ష తేదీల పూర్తి వివరాలను త్వరలోనే వెల్లడిస్తామన్నారు.

## బీబీఏ, బీఏ పరీక్ష తేదీల మార్పు

ఉస్మానియా యూనివర్సిటీ, నవంబర్ 15: ఓయూ పరిధిలోని బీబీఏ, బీఏ పరీక్ష తేదీలను మార్చినట్టు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ రాములు ఒక ప్రకటనలో తెలిపారు. బీబీఏ రిటెయిల్ ఆపరేషన్స్, బీబీఏ లాజిస్టిక్స్ మూడో సెమిస్టర్ రెగ్యులర్, బీఏ అయిదో సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షలను ఈనెల 19 నుంచి నిర్వహించనున్నట్టు గతంలో ప్రకటించామని, పరీక్షలను అదేరోజు నుంచి నిర్వహిస్తున్నప్పటికీ, వివిధ పరీక్ష తేదీలను మార్చినట్టు చెప్పారు.

## హోటల్ మేనేజ్‌మెంట్ కోర్సుల పరీక్ష తేదీల ఖరారు

ఉస్మానియా యూనివర్సిటీ, నవంబర్ 15: ఓయూ పరిధిలోని హోటల్ మేనేజ్‌మెంట్ కోర్సుల (బీహెచ్‌ఎంసీటీ, బీసీటీసీఏ) పరీక్ష తేదీలను ఖరారు చేసినట్టు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ రాములు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కోర్సుల మొదటి, మూడు, అయిదో సెమిస్టర్ మెయిన్, అన్ని సెమిస్టర్ల బ్యాక్‌లాగ్ ప్రాక్టికల్ పరీక్షలను ఈనెల 19 నుంచి నిర్వహించనున్నట్టు చెప్పారు.

## పలు పరీక్షల ఫలితాల విడుదల

ఉస్మానియా యూనివర్సిటీ, నవంబర్ 15: ఓయూ పరిధిలోని వివిధ కోర్సుల పరీక్ష ఫలితాలను విడుదల చేసినట్టు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ రాములు ఒక ప్రకటనలో తెలిపారు. బీఈ (ఏఐసీటీఈ) (సీబీసీఎస్) మెయిన్, బ్యాక్‌లాగ్, సప్లమెంటరీ, బీఈ (నాన్ సీబీసీఎస్) వన్‌టైం చాన్స్ పరీక్ష ఫలితాలతో పాటు డీపీఈడీ, బీపీఈడీ కోర్సుల రెండు, నాలుగో సెమిస్టర్ రెగ్యులర్, అన్ని సెమిస్టర్ల బ్యాక్‌లాగ్ పరీక్షల రివాల్యుయేషన్ పరీక్ష ఫలితాలను విడుదల చేసినట్టు చెప్పారు. ఈ ఫలితాలను ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.inలో చూసుకోవచ్చని సూచించారు.

# బాధితులకు అండగా ఉంటాం

- సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్

బన్సీలాల్‌పేట్, నవంబర్ 15: బాధిత కుటుంబానికి అండగా ఉంటానని మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. బుధవారం రాత్రి మోండా మార్కెట్‌లో పూజ సామగ్రి దుకాణం అగ్నికి ఆహుతి కావడంతో నష్టపోయిన బాధితుడు మల్లికార్జున్, అతడి కుటుంబ సభ్యులు శుక్రవారం మారెడ్‌పల్లిలోని ఎమ్మెల్యే కార్యాలయంలో ఆయనని కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే తలసాని వారిని పరామర్శించి ధైర్యం చెప్పారు. తలసాని ఆదేశంతో ప్రమాదం జరిగిన వెంటనే రెవెన్యూ శాఖ అధికారులు ఘటన జరిగిన దుకాణానికి వెళ్లి పంచనామ నిర్వహించారు. సికింద్రాబాద్ ఆర్డీఓతో ఫోన్‌లో మాట్లాడిన ఎమ్మెల్యే బాధితుడికి ప్రభుత్వ పరంగా నష్ట పరిహారం మంజూరు చేయించి ఆదుకోవాలని కోరారు. మోండా మార్కెట్ బీఆర్ఎస్ నాయకుడు తలసాని రవీందర్‌యాదవ్ (స్కైలాబ్) బాదితుడికి రూ.20 వేల ఆర్థిక సహాయం అందించిన విషయం తెలిసిందే. బాదితుడి వెంట బీఆర్ఎస్ బన్సీలాల్‌పేట్ అధ్యక్షుడు వెంకటేశన్ రాజు, సురేశ్, వెంకట్ ఉన్నారు.


ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌ను కలిసిన అగ్నిప్రమాద బాధితులు


ఎమ్మెల్యేతో సమావేశమైన కాలనీ ప్రతినిధులు

### ఎయిర్‌పోర్ట్ కాలనీ సమస్యలు పరిష్కరిస్తా

బేగంపేట్: ప్రజా సమస్యల పరిష్కారానికే ప్రాధాన్యతనిస్తానని సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. బేగంపేట్ డివిజన్ ఎయిర్‌పోర్ట్‌కాలనీ అసోసియేషన్ ప్రతినిధులు శుక్రవారం ఎమ్మెల్యే శ్రీనివాస్‌యాదవ్‌ను ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం ఎమ్మెల్యేతో సమావేశమైన కాలనీలో ప్రతినిధులు దీర్ఘ కాలంగా ఎదురు చూస్తున్న పార్కు, రోడ్ల నిర్మాణాలను చేపట్టాలన్నారు. కొనసాగుతున్న డ్రైనేజీ నిర్మాణాల పట్ల ఆనందాన్ని వ్యక్తం చేశారు. కాలనీలో నెలకొన్న తాగునీటి సమస్యను పరిష్కరించాలని ఎమ్మెల్యేను కోరారు. స్పందించిన తలసాని తాను ఎప్పటికీ ప్రజల మధ్య ఉంటూ సమస్యల పరిష్కారం కోసం పని చేస్తానని, తాగు నీటి సమస్యను తీర్చేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. క్షేత్రస్థాయిలో సమస్యను పరిశీలించి పరిష్కార దిశగా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు ఎమ్మెల్యే ఫోన్‌ద్వారా ఆదేశించారు. ఎమ్మెల్యేతో సమావేశమైన వారిలో అసోసియేషన్ అధ్యక్షుడు నగేశ్, కార్యదర్శి గోపాల్, రూప్‌కుమార్, పీబీఎన్ రెడ్డి, కోటేశ్వర్‌రావు తదితరులున్నారు.

### కార్యకర్తలను ఆదుకుంటాం..

ముషీరాబాద్: ఇటీవల విద్యుత్ షాక్‌కు గురైౖ భోలక్‌పూర్ డివిజన్‌కు చెందిన బీఆర్ఎస్ కార్యకర్త మిరాజ్ సుల్తాన్ ఖురేషిని ఆ పార్టీ యువజన విభాగం నేత ముఠా జయసింహ శుక్రవారం పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకున్న అన్ని విధాలుగా అదుకుంటామని హామీ ఇచ్చారు.



## ఆలయాల అభివృద్ధికి కృషి


ఎమ్మెల్యే ముఠా గోపాల్ దంపతులను ఆహ్వానిస్తున్న అసోసియేషన్ సభ్యులు

చిక్కడపల్లి, నవంబర్ 15: ఆలయాల అభివృద్ధికి కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. గాంధీనగర్ డివిజన్ సిద్ధంశెట్టి అపార్ట్‌మెంట్ ప్రాంగణంలోఉన్న పోచమ్మ ఆలయంలో ఆదివారం పూజలు నిర్వహిస్తారు. ఈ సందర్భంగా ఆ అపార్ట్‌మెంట్ అసోసియేషన్ సభ్యులు శుక్రవారం ఎమ్మెల్యే దంపతులను కలిసి ఆహ్వానం అందించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు ముఠా నరేశ్, అసోసియేషన్ సభ్యులు లక్ష్మి, మణి, పద్మ, ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

## నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

ముషీరాబాద్, నవంబర్ 15: టీఎస్ఎస్‌పీడీసీఎల్ ఆజామాబాద్ డివిజన్ 11కేవీ ఫీవర్ ఆసుపత్రి, బసంతకాలనీ ఫీడర్ల పరిధిలో విద్యుత్ లైన్ల మరమ్మతు కారణంగా శనివారం(నేడు) విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు ఆజామాబాద్ డివిజన్ ఏడీఈ జీ నాగేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి 1గంట వరకు ఫీవర్ ఆసుపత్రి ఫీడర్ పధిలోని అంజయ్య క్వార్టర్స్, ఫీవర్ ఆసుపత్రి, తెలంగాణ యువతి మండలి, బర్కత్‌పుర పెట్రోల్ బంక్ పరిసరాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తారు. మధ్యాహ్నం 2 నుంచి 5 గంటల వరకు బసంత్‌కాలనీ ఫీవర్ పరిధిలోని లింగంపల్లి, బసంతకాలనీ, వైశ్య హాస్టల్, వెంకటరమణ థియేటర్, జైన్‌మందిర్, కాచిగూడ ఎక్స్‌రోడ్ పరిసరాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు వెల్లడించారు.

# ఘనంగా కార్తిక పౌర్ణమి వేడుకలు

సికింద్రాబాద్, నవంబర్ 15: కార్తిక పౌర్ణమిని భక్తులు శుక్రవారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. శైవ క్షేత్రాలకు భక్తులు తరలి వెళ్లారు. ఆలయాల్లో సామూహిక సత్యనారాయణ స్వామి వత్రాలు నిర్వహించారు. భక్తులకు ఆలయాల నిర్వాహకులు అన్నదానం చేశారు. ఇందిరానగర్ కాలనీ రోడ్డు నంబర్ 1లో లక్ష్మికమలాత్మిక ఆలయంలో పౌర్ణమి సందర్భంగా భక్తులకు అన్నదానం నిర్వహించారు. ప్రతి పౌర్ణమి రోజు భక్తుల కోసం అన్నదానం ఏర్పాటు చేస్తామని ఆలయ చైర్మన్ టి.సందీప్‌కుమార్ తెలిపారు. కార్తిక మాసం కార్తీక పౌర్ణమి శుక్రవారం సందర్భంగా విశేషంగా అమ్మవారి పూజలు అన్నప్రసాద వితరణ ఘనంగా నిర్వహించామన్నారు. బొమ్మల సురేశ్‌కుమార్ కుటుంబ సభ్యులు అన్నదానం చేశారు.


అమీర్‌పేట్: జ్వాలా తోరణం

### జ్వాలా తోరణం..

అమీర్‌పేట్: సనత్‌నగర్ హనుమాన్ ఆలయంలో 'జ్వాలా తోరణం' భక్తి శ్రద్ధలతో జరిగింది. ఆలయ ఈవో సత్యనారాయణ నాయుడు, అర్చకులు పరాశరం రవీంద్రాచార్యులు, రిపుంజయశర్మ పాల్గొన్నారు. బల్కంపేట ఎల్లమ్మ ఆలయంలో లక్ష దీపోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ఈవో బొల్లేపల్లి కృష్ణ, చైర్మన్ కొత్తపల్లి సాయిగౌడ్, వేద పండితులు వెంకటరమణశర్మ, రామనాథశర్మ, రాజీవ్‌శర్మలతో పాటు ఆలయ అధికారులు హైమావతి, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

### దీపోత్సవం

చిక్కడపల్లి: ఆర్టీసీ క్రాస్ రోడ్స్‌లోని లక్ష్మిగణపతి ఆలయంలో పూజలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్ని దీపాలు వెలిగించారు. గాంధీనగర్ కార్పొరేటర్ పావనివినయ్‌కుమార్ హాజరయ్యారు. ఈఓ లక్ష్మారెడ్డి కార్యక్రమాలను పర్యవేక్షించారు.

చిక్కడపల్లి వివేక్‌నగర్‌లోని ఆంజనేయస్వామి ఆలయంలో శుక్రవారం కార్తీక పౌర్ణమి సందర్భంగా సమూహిక సత్యనారాయన వ్రతాలు ఘనంగా జరిగాయి. కార్తిక మాస సందర్భంగా ఆలయ ప్రాంగాణంలోని శివాలయంలో పూజలు నిర్వహించారు. కార్యనిర్వాహణాధికారి దేవనాథం, అర్చకులు పాల్గొన్నారు. ఆర్టీసీ క్రాస్ రోడ్స్‌లోని లక్ష్మిగణపతి ఆలయంలో సమూహిక సత్యనారాయణ వ్రతాలు ఘంనగా జరిగాయి. కార్యనిర్వాహణాధికారి లక్ష్మారెడ్డి కార్యక్రమాలను పర్యవేక్షించారు.


ఇందిరానగర్ రోడ్డు నంబర్ 1లో అన్నదానం


అమీర్‌పేట్: లక్ష దీపోత్సవం


ముషీరాబాద్‌లో సాముహిక సత్యనారాయణ వ్రతాలు

### ముషీరాబాద్‌లో

ముషీరాబాద్: కార్తీక పౌర్ణమి వేడుకలు ముషీరాబాద్ నియోజకవర్గంలో ఘనంగా జరిగాయి. పెద్ద ఎత్తున భక్తులు ఆలయాలకు తరలివచ్చి పూజలు, అభిషేకాలు నిర్వహించి కార్తీక దీపాలను వెలిగించారు.

### ముత్యాలమ్మ ఆలయంలో

కంటోన్మెంట్: బోయిన్‌పల్లి బాపూజీనగర్ ముత్యాలమ్మ ఆలయంలో ఎమ్మెల్యే శ్రీగణేశ్, బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపన ప్రతాప్‌తో కలిసి అమ్మవారికి పూజలు చేశారు. అనంతరం ఆలయ ముఖ ద్వారాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో దుర్గయ్య, ముప్పిడి మధుకర్, సదానంద్, ముఖేశ్‌యాదవ్ పాల్గొన్నారు.

## డివిజన్‌లో పర్యటించిన కార్పొరేటర్


నాలా పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ కంది శైలజ

ఉస్మానియా యూనివర్సిటీ, నవంబర్ 15: బౌద్ధనగర్ డివిజన్‌లో స్థానిక కార్పొరేటర్, జీహెచ్ఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యురాలు కంది శైలజ పర్యటించారు. జీహెచ్ఎంసీ ఏఈ కౌశిక్, లావణ్య, అధికారులతో కలిసి నాలా పనులను పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా పనులను వేగంగా పూర్తి చేయాలని సూచించారు. పనుల నాణ్యత విషయంలో రాజీ పడకూడదని అన్నారు. డివిజన్‌లో జరుగుతున్న వివిధ అభివృద్ధి పనులు త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని కోరారు.

## రీయింబర్స్‌మెంట్ బకాయి విడుదల చేయాలి


కార్యకర్తల సమావేశంలో మాట్లాడతున్న పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు మహేశ్

ముషీరాబాద్, నవంబర్ 15: పెండింగ్‌లో ఉన్న ఫీజు బకాయి వెంటనే చెల్లించాలని పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు పి.మహేశ్ డిమాండ్ చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి యేడాది గడుస్తున్నా సీఎం విద్యారంగ సమస్యలపై దృష్టి సారించకపోవడం శోచనీయమన్నారు. శుక్రవారం విద్యానగర్ మార్క్స్ భవన్‌లో కార్యకర్తల సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ సంవత్సరాల ఫీజు బకాయి విడుదల చేకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇక్కట్లు పడుతున్నారని అన్నారు. హాస్టల్ సమస్యలను పట్టించుకునే నాథుడే కరయ్యాడని, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయి సకాలంలో చెల్లించకపోవడం వల్ల విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.శ్రీనివాస్, ఆసిఫ్, జాహ్నవి, గౌతమ్, హరిజ్ఞ, గణేశ్, శరత్, రహీం, సాయికృష్ణ, జీవర్ తదితరులు పాల్గొన్నారు.



## స్వయం సహాయక రుణాలు సద్వినియోగం చేసుకోవాలి

స్వయం సహాయక రుణాలు సద్వినియోగం చేసుకోవాలని కంటోన్మెంట్ బోర్డు ఆరో వార్డు మాజీ సభ్యుడు పాండుయాదవ్ అన్నారు. శుక్రవారం ఆరోవార్డు పరిధిలోని మహాత్మానగర్ మథర్ థెరిస్సా మహిళా పొదుపు సంఘానికి మంజూరైన రూ.20లక్షలు నగదును గ్రూపు సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో మేరీ, రాధ, లక్ష్మి, యాదమ్మ, నేహ, కనకతార, పుష్ప, వందన, శ్యామల పాల్గొన్నారు. - కంటోన్మెంట్:

## వివిధ కళాశాలలకు నూతన ప్రిన్సిపాల్స్ నియామకం


నిజాం కళాశాల ప్రిన్సిపాల్‌గా నియామక పత్రం అందుకుంటున్న ప్రొఫెసర్ ఏవీ రాజశేఖర్

ఉస్మానియా యూనివర్సిటీ, నవంబర్ 15: ఓయూ పరిధిలోని వివిధ కళాశాలలకు ప్రిన్సిపాల్స్‌తో పాటు కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ పదవుల్లో నూతన నియామకాలను అధికారులు చేపట్టారు. ఓయూ వీసీ ప్రొఫెసర్ ఎం.కుమార్ నియామక పత్రాలు అందజేశారు. నిజాం కళాశాల ప్రిన్సిపాల్‌గా జువాలజీ విభాగానికి చెందిన ప్రొఫెసర్ ఏవీ రాజశేఖర్, ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్‌గా తెలుగు విభాగానికి చెందిన ప్రొఫెసర్ సి.కాసీం, సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్‌గా జియాలజీ విభాగానికి చెందిన ప్రొఫెసర్ జి.ప్రభాకర్, టెక్నాలజీ కళాశాల ప్రిన్సిపాల్‌గా కెమికల్ టెక్నాలజీ విభాగానికి చెందిన ప్రొఫెసర్ వి.రమేశ్‌కుమార్, కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ కళాశాల ప్రిన్సిపాల్‌గా కామర్స్ విభాగానికి చెందిన ప్రొఫెసర్ ఇంద్రకంటి శేఖర్, లా కళాశాల ప్రిన్సిపాల్‌గా డాక్టర్ ఎన్.రాంప్రసాద్, సైఫాబాద్ పీజీ కళాశాల ప్రిన్సిపాల్‌గా బోటని విభాగానికి చెందిన ప్రొఫెసర్ కె.శైలజ, కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్‌గా సివిల్ ఇంజినీరింగ్ విభాగానికి చెందిన ప్రొఫెసర్ శశికాంత్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా వారిని పలువురు అభినందించారు.

### వెయిట్ లిఫ్టింగ్ చాంపియన్

చిక్కడపల్లి, నవంబర్ 15: వెయిట్ లిఫ్టింగ్ చాంపియన్‌షిప్‌లో బాగ్‌లింగంపల్లి డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కళాశాల విద్యార్థులు సత్తాచాటారు. ఓయూ ఇంటర్ కాలేజ్ వెయిట్ లిఫ్టింగ్ చాంపియన్‌షిప్‌లో అంబేద్కర్ కళాశాల ప్రథమ స్థానంలో నిలిచింది. జె.సాయి 230 కిలోలు ఎత్తి బంగారు పతకాన్ని, బి.కార్తీక్ 109 కేజీల విభాగంలో గోల్డ్ మెడల్, ఉనైజ్ అయాజ్ 110 కిలోలు ఎత్తి కాంస్య పతకాన్ని సాధించారు. పలు బంగారు, కాంస్య పతకాలు సాధించిన విజేతలకు ఈ సందర్భంగా సర్టిఫికెట్లు, మెడల్స్, ఓవరాల్ చాంపియన్‌షిప్ షీల్డ్‌ను అందజేశారు.

# నిధుల కొరతతో నిర్మాణం ఆపేయడమా!


సీతాఫల్‌మండి ప్రభుత్వ పాఠశాలను పరిశీలిస్తున్న సీపీఐ నాయకులు


సికింద్రాబాద్, నవంబర్ 15: నిధుల కొరతతో సీతాఫల్‌మండిలోని విద్యా సంస్థల భవన నిర్మాణాన్ని అర్థాంతరంగా నిలిపి వేయడం సిగ్గుచేటని సీపీఐ సికింద్రాబాద్ కార్యదర్శి కాంపల్లి శ్రీనివాస్ విమర్శించారు. నిలిచిన నిర్మాణానికి కేటాయించిన రూ.30 కోట్లను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ సీపీఐ బృందం శుక్రవారం పరిశీలించింది. వారు మాట్లాడుతూ.. విద్యార్థులు ప్రభుత్వ విద్యకు దూరమయ్యే ప్రమాదం నెలకొనదని, యుద్ధ ప్రాతిపదికన నిర్మాణం పూర్తి చేయాలని కోరారు. అదే విధంగా సీఎం రేవంత్‌రెడ్డి అనేక సార్లు ప్రభుత్వ విద్య బలోపేతం కోసం పెద్దపీట వేశామని, విద్యారంగానికి అధిక నిధులు కేటాయించామని చెబుతున్నారని ఆయన గుర్తుచేశారు. కానీ ఆ మాటలన్నీ కేవలం పేపర్‌కు మాత్రమే పరిమితమయ్యాయని ఎద్దేవా చేశారు. క్షేత్రస్థాయిలో మాత్రం విద్యా రంగాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వందలాది మంది విద్యార్థుల భవిష్యత్తుకు సంబంధించిన సీతాఫల్‌మండి స్కూల్ నిర్మాణానికి కేటాయించిన నిధులను తక్షణమే విడుదల చేసి వేగంగా నిర్మాణాన్ని చేపట్టి ప్రభుత్వ విద్య పట్ల తమకున్న చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు సీపీఐ నేత కొమురెల్లి బాబు, సోమయ్య, ఏఐఎస్ఎఫ్ ఓయూ అధ్యక్షుడు చైతన్య యాదవ్, లెనిన్, గువ్వల మల్లేశ్, నాగరాజు, శ్రీహరి, యాకయ్య, రమేశ్, రవి, రవికాంత్, యాదగిరి, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# క్రీడాకారుల ప్రోత్సాహానికి ప్రభుత్వం కృషి


మడ్‌ఫోర్డు గ్రౌండ్‌ను పరిశీలిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యే శ్రీగణేశ్, కంటోన్మెంట్ బోర్డు సీఈఓ మధుకర్‌నాయక్

బొల్లారం, నవంబర్ 15: క్రీడలు, క్రీడాకారులను ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేశ్ అన్నారు. కంటోన్మెంట్ మడ్‌ఫోర్డులోని దోబీఘాట్ గ్రౌండ్‌లో స్పోర్ట్స్ కాంప్లెక్స్ నిర్మించడానికి ప్రతిపాదించిన నేపథ్యంలో శుక్రవారం మంత్రి, ఎమ్మెల్యే, కంటోన్మెంట్ బోర్డు సీఈఓ మధుకర్‌నాయక్ గ్రౌండ్‌ను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ కంటోన్మెంట్ ప్రాంతం క్రీడాకారులకు పెట్టింది పేరని, క్రీడలను ప్రోత్సహించేందుకు దోబీఘాట్ గ్రౌండ్‌లో స్పోర్ట్స్ కాంప్లెక్స్ నిర్మించ తలపెట్టినట్టు తెలిపారు. కంటోన్మెంట్ ప్రాంతంలో రోడ్ల విస్తరణలో భాగంగా రాజీవ్ రహదారిలో ఓఆర్ఆర్ జంక్షన్ వద్ద ప్యారడైజ్ జంక్షన్ నుంచి శామీర్‌పేట వరకు, ప్యారడైజ్ నుంచి డైరీఫాం రోడ్డు వరకు ఎలివేటేడ్ కారిడార్ల నిర్మాణానికి సేకరించిన డిఫెన్స్ స్థలాలకు రాష్ట్ర ప్రభుత్వం రూ.303.62 కోట్లు చెల్లిస్తుందని పేర్కొన్నారు. అదేవిధంగా హెచ్‌ఎండబ్ల్యూఎస్, ఎస్‌బీ ఆధ్వర్యంలో అండర్ గ్రౌండ్ జీవరేజీ, జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో హస్మత్‌పేట నాలా, పికెట్ నాలాలను అభివృద్ధి చేయనున్నట్టు వెల్లడించారు.

## 17న డిజిటల్ మీడియా జర్నలిస్టుల యూనియన్ ఆవిర్భావ సభ


కరపత్రాలను ఆవిష్కరిస్తున్న డిజిటల్ మీడియా జర్నలిస్టుల యూనియన్ నేత రాజేంద్రప్రసాద్, ప్రతినిధులు

బన్సీలాల్‌పేట్, నవంబర్ 15: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు డిజిటల్ మీడియా జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించాలని తెలంగాణ జర్నలిస్టుల ఫ్రంట్ రాష్ట్ర నాయకుడు మోహన్ బైరాగి అన్నారు. శుక్రవారం పద్మారావునగర్‌లోని వ్యవస్థాపక అధ్యక్షుడు కె.రాజేంద్రప్రసాద్, ఉపాధ్యక్షుడు టి.యుగేందర్, బి.ఉదయ్‌కుమార్, స్కై ఫౌండేషన్ అధ్యక్షుడు డాక్టర్ వై.సంజీవ్‌కుమార్‌తో కలిసి డిజిటల్ మీడియా జర్నలిస్టుల యూనియన్ ఆవిర్భావ సభ కరపత్రాలను ఆయన విడుదల చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ మహబూబాబాద్‌లో ఈనెల 17న జరుగనున్న డీజీఎంయూ ఆవిర్భావ సభను విజయవంతం చేయాలని కోరారు. రాష్ట్రంలో జర్నలిస్టు హక్కుల సాధన కోసం తమ యూనియన్ పనిచేస్తుందని తెలిపారు. ప్రస్తుతం అధికారంలో ఉన్న ప్రభుత్వాలు జర్నలిస్టులకు అక్రిడేషన్ కార్డులు, ఇండ్ల స్థలాలు ఇవ్వకుండా నిర్లక్ష్యానికి గురిచేస్తున్నదని అన్నారు. జర్నలిస్టులను ఎకతాటిపైకి తీసుకువచ్చి, హక్కులను సాధించుకునేందుకు డిజిటల్ మీడియా జర్నలిస్టులను సంఘటితం చేస్తామని రాజేంద్రప్రసాద్ తెలిపారు.

## నేడు డయల్ యువర్ ఆర్ఎం

మారేడ్‌పల్లి, నవంబర్ 15: సికింద్రాబాద్ రీజియన్ 'డయల్ యువర్ ఆర్ఎం' నేడు సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు నిర్వహించనున్నట్టు సికింద్రాబాద్ రీజియన్ అధికారి ఖుస్రో షాఖాన్ శుక్రవారం ఒక ప్రకటనలో వెల్లడించారు. ఆర్టీసీ సంస్థ మనుగడ కోసం తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సలహాలు, సూచనలు, ప్రయాణికులు ఎదుర్కొంటున్న సమస్యలు ఈ కార్యక్రమంలో తమ దృష్టికి తీసుకొని రావాల్సింగా ఆయన కోరారు. ఆర్టీసీ సంస్థ అభివృద్ధే లక్ష్యంగా పని చేస్తున్నామని, ప్రయాణికులు తమ విలువైన సలహాలు, సూచనలు చెప్పాల్సింగా ఆయన సూచించారు. సంప్రదించాల్సిన నంబర్ 99599 00808కు ఫోన్ చేయాల్సింగా కోరారు.

## 18 నుంచి జర్నలిస్ట్స్ సొసైటీ సభ్యత్వ నమోదు

చిక్కడపల్లి, నవంబర్ 15: గ్రేటర్ జర్నలిస్ట్స్ మ్యూచివల్లీ ఎయిడెడ్ కోఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ సభ్యత్వ నమోదు ఈనెల 18 నుంచి 25 వరకు కొనసాగుతుందని సొసైటీ అధ్యక్షుడు మామిడి సోమయ్య, కార్యదర్శి బొల్ల శ్రీనివాస్ తెలిపారు. గ్రేటర్ పరిధిలో పనిచేస్తున్న జర్నలిస్టుల విజ్ఞప్తి మేరకు మరోసారి సభ్యత్వ నమోదు చేపట్టాలని సొసైటీ కార్యవర్గం నిర్ణయిచింద్నరు. వారం పాటు సభ్యత్వ నమోదు ఉంటుందని, అర్హులైన ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టుల దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఇతర వివరాల కోసం ఫోన్ నంబర్ 91009 33723, 77996 81212లో సప్రందించాలని సూచించారు.

## హౌసింగ్ బోర్డ్ షాపులను తెరిపించాలి

చిక్కడపల్లి, నవంబర్ 15: రాష్ట్ర హౌసింగ్ బోర్డు అసోసియేషన్ బాగ్‌లింగపంల్లి అధ్యక్షుడు శ్యామ్‌యాదవ్ ఆధ్వర్యంలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని కలిసి హౌసింగ్ బోర్డ్ షాపులను తెరిపించాలని విజ్ఞప్తి చేశారు. షాపుల యజమానులకు మార్కెట్ రేటు కంటే తక్కువ ఫీజుకు రిజిస్ట్రేషన్ చేయాలని కోరారు. ఆయన మాట్లాడుతూ మంత్రి సానుకూలంగా స్పందించారన్నారు. అలాట్ అయిన వారికి ప్రభుత్వ రేటు కంటే 10 శాతం తక్కువ ఫీజుతో రిజిస్ట్రేషన్ చేయించేందుకు త్వరలోనే చర్యలు తీసుకుంటామని మంత్రి హామీ ఇచ్చారని తెలిపారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి సి.కుమార్, సభ్యులు మహేదర్, షరీఫ్ వెంకటేశ్వర్‌రావు, అశోక్ పాల్గొన్నారు.